క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



మాట్లాడుతున్న సీఐ నాగభూషణం

అట్లూరు : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బద్వేలు రూరల్ సీఐ నాగ భూషణం తెలిపారు. అట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన యాంటి డ్రగ్స్ అవగాహణ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశలోనే మనం చేరుకోవాలనుకున్న లక్ష్యాన్ని చేరుకునేంత వరకూ ఇష్టంతో చదవాలన్నారు. మత్తు పదార్థాలు కటుంబాలను వీదిన పడేస్తున్నాయన్నారు. స్థానిక తహసీల్దారు సుబ్బలక్షుమ్మ, గోపవరం ఎస్ఐ శ్రీకాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల తనిఖీ



పరీక్షలను పరిశీలిస్తున్న ఆచార్య కృష్ణారావు

ప్రొద్దుటూరు : యోగి వేమన యూనివర్సిటీ పరిధిలోని జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య కృష్ణారావు శనివారం తనిఖీ చేశారు. నవంబర్ 29వ తేదీ నుంచి డిగ్రీ కాలేజీల్లో సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణ గీతాశ్రమంలోని వేంకటేశ్వర డిగ్రీ కాలేజీతోపాటు పలు కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు.

నేడు భగవద్గీతా ప్రవచనం



మాట్లాడుతున్న రామ్మోహన్, శబరీష్

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలోని ఇస్కాన్ కేంద్రంలో ఆదివారం ఉదయం 11.30 గంటలకు భగవద్గీతా ప్రవచనం ఉంటుందని ఇస్కాన్ ప్రతినిధులు రామ్మోహన్, శబరీష్ తెలిపారు. విలేకరులతో వారు మాట్లాడుతూ శ్రీమద్ భక్తి వికాస స్వామి మహారాజ్ పాల్గొని ప్రవచనాలు చేస్తారన్నారు. ఈయన 20 ఏళ్ల వయసులో ఇస్కాన్‌లో చేరి 50 ఏళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా పర్యటిస్తూ భగవద్గీత తత్వాన్ని ప్రచారం చేస్తున్నారన్నారు.

చారిత్రక కట్టడాలపై అవగాహన

వైవీయూ: జిల్లాలోని అపురూప శిల్ప సంపద.. జిల్లా ఔన్నత్యాన్ని చాటి చెబుతుందని ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి అన్నారు. కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో ఇంటాక్ ఆధ్వర్యంలో చారిత్రక కట్టడాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ మాట్లాడుతూ జిల్లాకు ఎంతో ఘనమైన చారిత్రక నేపథ్యం ఉందన్నారు. లలితకళల విభాగం విద్యార్థులు శిల్పకళా సంపదపై అధ్యయనం చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ ఎస్. రాజేష్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కళలు, సాహిత్యంతో పాటు ఎంతో విలువైన ఖనిజ సంపద కూడా జిల్లాలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఇంటాక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కలాణోత్సవం



అల్లాడుపల్లెలో కల్యాణ వేడుకలు

చాపాడు : మార్గశిర మాసం శుక్లపక్షం సుబ్రహ్మణ్య షష్టి తిథి పురస్కరించుకుని మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవస్థాన సన్నిధిలో శనివారం శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారి కల్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి కళ్యాణ వేడుకలను భక్తి శ్రద్ధలతో వీక్షించారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ: వైఎస్ఆర్ కడప జిల్లా పరిధిలోని 1962 మొబైల్ వెటర్నరీ అంబు లెన్స్‌లో పైలెట్లు(డ్రైవర్లు)గా పనిచేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 1962 పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి అనిల్‌కుమార్ కోరారు.

36 సంవత్సరాలలోపు వయోపరిమితి కలిగి ఉండి 10వ తరగతి ఉత్తీర్ణత, హెవీడ్రైవింగ్ లైసెన్స్ ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9154970180 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బాబుగారి భరోసా ఎప్పుడో!

- అర్హుల ఖాతాల్లో పీఎం కిసాన్ సొమ్ము జమ
- రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు
- పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు హామీ
- చంద్రబాబు సూపర్ సిక్స్‌లో రైతుభరోసా ఒకటి



రబీ సాగు చేసేందుకు దుక్కి దున్నుతున్న రైతు

కాశినాయన : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ రైతుభరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందజేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు సాయం అందిస్తూ సాగును పండుగలా మార్చారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబునాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో రైతుభరోసా ఒకటి. ఖరీఫ్ ముగిసి రబీ మొదలైనా బాబుగారి భరోసా రైతుల దరిచేరలేదు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని త్వరగా అమలు చేస్తే సాగుకు సాయంగా ఉంటుందని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. పుడమిపుత్రులు పొలాల బాట పట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఒకపక్క అతివృష్టి మరోపక్క అనావృష్టి, చీడపీడలు, నకిలీ విత్తనాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. గత పది రోజుల క్రితం పదును వాన కురవడంతో నియోజకవర్గంలో రబీ సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. పచ్చని సిరులు పండించేందుకు ఏటా ప్రభుత్వం అందించే సాయం కోసం రైతులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పంట సాగు ఆర్థిక సాయం ఎప్పుడు వస్తుందా అనే అయోమయంలో పడ్డారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి నగదు రైతుల ఖాతాల్లో జమ అయింది. కొత్తగా పగ్గాలు చేపట్టిన టీడీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు ఆర్థిక సాయంపై ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఖరీఫ్ సాగు ముగిసి రబీ సాగు ప్రారంభించిన రైతులు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం త్వరగా వస్తే సాగుకు వెసులుబాటుగా ఉంటుందని ఆశగా చూస్తున్నారు.

ప్రభుత్వానికి రైతుల విన్నపం

గత ప్రభుత్వం వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి కలిపి రైతులకు ఏటా రూ.13500లు మూడు దఫాలుగా అందించేది. దీని వలన ఖరీఫ్‌లో పంట పెట్టుబడికి వెసులుబాటుగా ఉండేది. తొలి విడతగా మే నెలలోనే రూ.7500లు రైతు ఖాతాల్లో జమ చేసేది. దీని వలన చిన్న, సన్నకారు, పేద రైతులకు ఖరీఫ్‌లో పెట్టుబడి చాలా వరకు కలిసి వచ్చేది. మే నెలతో పాటు అక్టోబర్, జనవరి నెలల్లో ఈ రెండు పథకాల నిధులు వారి ఖాతాల్లో పడేది. వైఎస్సార్ రైతుభరోసా తొలి విడతగా రూ.5500లు, రెండవ విడత అక్టోబర్ నెలలో రూ.2 వేలు చొప్పున అందించేవారు. కేంద్రం పీఎం కిసాన్ నిధిగా రూ.6 వేలును మూడు విడతలుగా రూ.2 వేలు చొప్పున ఇచ్చేవారు. ఈ ఏడాది మే నెలలో సార్వత్రిక ఎన్నికల కారణంగా పీఎం కిసాన్ నిధి ఆలస్యంగా జూన్ నెలలో వేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు రూ.20 వేలకు సంబంధించి ఇప్పటి వరకు జీవో విడుదల కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ ఖాతాల్లో పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేస్తే సకాలంలో పంటలను సాగు చేసుకుంటామని రైతులు అంటున్నారు.

సీఎన్‌జీ అవుట్‌లెట్ ప్రారంభం



మున్సిపల్ పెట్రోలు బంకులో సీఎన్‌జీ అవుట్ లెట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక కొర్రపాడు రోడ్డులోని త్రీటౌన్ పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకులో ఏర్పాటు చేసిన సీఎన్‌జీ అవుట్ లెట్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ మున్సిపాలిటీ స్థలంలో హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంకు నిర్వహిస్తున్నారని, అదే తరహాలో సుమారు రూ.36 లక్షలు వెచ్చించి కంప్రెహెన్సివ్ న్యాచురల్ గ్యాస్ అవుట్‌లెట్ ఏర్పాటు చేశారన్నారు. ఎక్కువ మంది గ్యాస్ వాహనాలను వినియోగిస్తుండటంతో ఈ సౌకర్యాన్ని కల్పించామన్నారు. ప్రతి కిలో గ్యాస్‌కు హెచ్‌పీసీఎల్ కమీషన్‌ను మున్సిపాలిటీకి చెల్లిస్తుందని తెలిపారు. నాణ్యత, నమ్మకంతో కూడిన పెట్రోల్, డీజల్‌తో పాటు గ్యాస్‌ను తాము అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈవీ సుధాకర్‌రెడ్డితోపాటు పలువురు కౌన్సిలర్లు, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మల్లేషు

చాపాడు : సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేషు అన్నారు. మండలంలోని నక్కలదిన్నె గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం గ్రామ సర్పంచ్ అంజనమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ మొక్కలు పెంచడం వలన ఆక్సిజన్ విరివిగా లభిస్తుందన్నారు. కానుగ, వేప చెట్లను ఎక్కువగా నాటాలని, వీటి వలన సమాజంలో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందన్నారు. అనంతరం నరహరిపురంలో జరిగిన పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లో వైద్య సిబ్బంది పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరహరిశర్మ, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్ ప్రసాద్, ఆశా నోడల్ అధికారి సుకన్య, సీహెచ్‌ఓ అంజూమ్, ఏఎన్‌ఎంలు సుజాత, శాంతకుమారి, సాలమ్మ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం





ప్రత్యేక అలంకరణలో చాముండేశ్వరి ఉత్సవమూర్తి, చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : లోక కళ్యాణార్థం స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. వేకువజామున చాముండేశ్వరి అమ్మవారికి, దత్తాత్రేయస్వామి, సత్యనారాయణస్వామి, విశ్వేశ్వరుడు, ఆంజనేయస్వామికి విశేష పూజలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. చాముండేశ్వరి అమ్మవారి వద్ద వెండి శ్రీచక్రాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం లోకకళ్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

సమస్యల పరిష్కారానికి కృషి



సుందరయ్యకాలనీలో ప్రజా సమస్యలు తెలుసు కుంటున్న మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సుందరయ్యకాలనీలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ సుందరయ్యకాలనీలో తాగునీటి సమస్య, వీధిలైట్లు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని, రెండు రోజుల క్రితం అక్కడి ప్రజలు వినతి పత్రం ఇచ్చిన నేపథ్యంలో వాటిని పరిష్కరించాలని తెలిపారు. గతంలో సమీపంలోని వ్యవసాయ బోర్ల వద్ద నుండి నీటిని తెచ్చుకునేవారని, ప్రస్తుతం కుళాయి కనెక్షన్లు ఇవ్వడం ద్వారా తాగునీటి సమస్య పరిష్కారమైందని అన్నారు. అక్రమ కుళాయి కనెక్షన్లను రెగ్యులర్ చేయించుకోవాలని కోరారు. అలాగే సకాలంలో ఇంటి పన్నులు, నీటి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఏఈ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పడిపూజ

అట్లూరు : అట్లూరు క్రాస్‌రోడ్డులో వెలసిన అయప్ప ఆలయంలో శుక్రవారం రాత్రి అయప్పస్వామి అంబళం మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజ అయప్ప మాలాధారణలో ఉన్న రొండా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ పూజా కార్యక్రమానికి శ్రీ కొండలస్వామి భజన కచేరి చేశారు. వచ్చిన భక్తులకు అన్నధాన కార్యక్రమం నిర్వహించారు.

ఆత్మీయ సమావేశం



కాశినాయన : మాట్లాడుతున్న జెడ్పీటీసీ సత్యనారాయణరెడ్డి



ప్రొద్దుటూరు : దొరసానిపల్లె జెడ్పీహెచ్‌ఎస్‌లో జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో అధికారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం పండగ వాతావరణంలో ఉత్సాహంగా సాగింది. ప్రముఖులు పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. స్థానిక వైవీఎస్ మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశం సందర్భంగా విద్యార్థుల తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించారు. తహసీల్దారు గంగయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని, బాగా చదివించి వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ లక్ష్మీ, బచ్చల పుల్లయ్య, విజయభాస్కర్, నాగార్జున, డాక్టర్ వైవీ.రామమునిరెడ్డి, డాక్టర్ నరసింహారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఈవీ సుధాకర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

- దొరసానిపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మీ విద్యార్థుల ప్రగతిని తెలిపే హోలిస్టిక్ ప్రొగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో పరిశీలకురాలు సుభాషిణి, ఎంఈఓ సావిత్రమ్మ, రూరల్ ఎస్ఐ వెంకటసురేష్, రామిశెట్టి, భాస్కరరెడ్డి, మునివర, సుధాకరరెడ్డి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.
- తాళ్లమాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచాలని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు రఘురామయ్య, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ దస్తగిరమ్మ, రూరల్ ఎస్సై మహ్మద్ రఫీ, సర్పంచ్ కొండారెడ్డి, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మీ, నిర్మల, అంకాల్ కొండయ్య, సుబ్బానాయుడు తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక మొడంపల్లె ఉర్దూ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. టూటౌన్ సీఐ యుగంధర్ చిన్నారులను చెడువ్యసనాలు, అలవాట్ల జోలికి వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని తెలిపారు. ఎంఈఓ-2 శోభారాణి, మన ప్రజాసేవాసమితి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ప్రధానోపాధ్యాయుడు ఇమాంహుస్సేన్, టౌన్ బ్యాంకు ఉపాధ్యక్షుడు ఖలీల్, పేరెంట్ కమిటీ చైర్మన్ లాల్‌బాషా, వైస్ చైర్మన్ రహీమున్నిసా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని మున్సిపల్ కమిషనర్ ఎ.మల్లికార్జున తెలిపారు. స్థానిక రామేశ్వరంలోని ఎస్‌పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలున్నాయని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ భక్తవత్సలం, ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, జ్యోతి, నాగరాజు, గోపాల్ పాల్గొన్నారు. శంకర్‌రావు వీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో 13వ వార్డు కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాషా పాల్గొన్నారు.

బద్వేలు (వ్యవసాయం) : విద్యార్థుల్లో క్రమశిక్షణ ఉంటే ఎవరు ఎంచుకున్న వృత్తి నైపుణ్యంలో వారు ఉన్నత స్థానాలకు చేరుకుంటారని మండల అభివృద్ధి అధికారి డి.మల్లేశ్వరి తెలిపారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొండా వెంకటరామిరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ ప్రమీలపాల్గొన్నారు.

పోరుమామిళ్ల : పుల్లివీడులోని యూపీ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఎంపీడీఓ రమణారెడ్డి పాల్గొని మాట్లాడారు. తమ పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలకు క్రమం తప్పకుండా పంపాలన్నారు. కార్యక్రమంలో హెడ్మాష్టర్ రామకృష్ణారెడ్డి, సర్పంచ్ రఘురామిరెడ్డి, పాఠశాల చైర్మన్ ప్రసాద్, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే రంగసముద్రం, రామేశ్వరం ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని జెడ్పీటీసీ దేవసాని సత్యనారాయణరెడ్డి తెలిపారు. శనివారం వరికుంట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

మైదుకూరు : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్- టీచర్స్ సమావేశాల సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. సర్పంచ్ బండి నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో కొత్తపల్లె, ప్రకాష్ నగర్, తిప్పిరెడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలల్లో సమావేశాలు జరిగాయి. మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు తాడు లాగే పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ఉర్దూ హైస్కూల్‌లో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నారు.

ఖాజీపేట : పాఠశాలలో చదివే విద్యార్థుల ప్రగతే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీఓ దివిజా సంపతి అన్నారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలలు, 66 ప్రాథమిక పాఠశాలల్లో సమావేశాలు జరిగాయి. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంఈఓ స్వర్ణలత, లక్ష్మిరెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చాపాడు : మండలంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాల, స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలకు మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మీ, తహసీల్దారు రమాకుమారి హాజరుకాగా, లక్ష్మీపేటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి మండల అధ్యక్షులు టి.లక్షుమయ్య హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఎంపీడీఓ వీర కిషోర్, ఎంఈఓ లు రవిశంకర్, వంశీకృష్ణ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో నిర్వహించే సమావేశాలు దోహదపడతాయని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. పూసలవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తరగతి గదుల కొరత, క్రీడా మైదానం లేవని తల్లిదండ్రులు తెలపడంతో మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆర్డీఓ చంద్రమోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన, సౌకర్యాలు అందిస్తున్నారన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ శ్రీనివాసులుపాల్గొన్నారు.

బి.కోడూరు : కాసానగరంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ తల్లిదండ్రులు పాఠశాలతో అనుసంధానం కావడం, ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

గోపవరం : రాచాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల వైద్యాధికారి ఇ.మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు ఆరోగ్యం ముఖ్యమన్నారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ఆటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జయరామిరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వెంకటరమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీ నేత అసంతృప్తి

చాపాడు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంపై టీడీపీ నేత, ఉప సర్పంచ్ లింగిరెడ్డి నాగేశ్వరరెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని టీఓపల్లె లోని ప్రాథమిక పాఠశాలలో శనివారం జరిగిన పేరెంట్ టీచర్స్ సమావేశానికి ఉప సర్పంచ్‌గా తనకు ఆహ్వానం అందలేదని నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య అవగాహన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సమావేశం పట్ల ఉపాధ్యాయుల నిర్లక్ష్యం వైఖరి సరికాదన్నారు. ప్రధానోపాధ్యాయుడు ఈ సమావేశాన్ని తేలికగా తీసుకుని నిర్వహించటం, ఎంఈఓ రవిశంకర్ సైతం దీనిపై స్పందించిన తీరు బాలేదన్నారు.

చర్చ లేకుండా ముగిసిన సమావేశం

బ్రహ్మంగారిమఠం: ప్రభుత్వం ఆత్మీయ సమ్మేళనం పేరుతో శనివారం సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశంలో విద్యార్థులకు ఉపయోగకరంగా ఎలాంటి మాటలు అధికారులు మాట్లాడలేదు. పాఠశాలల్లో మౌలిక వసతులపై చర్చేలేదు. సమావేశాల్లో అధికార పార్టీ నాయకులు మాత్రం పాల్గొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి సన్మానం చేశారు. ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఎంఈఓ పుల్లయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మార్గశిర మాసం మొదటి శనివారం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని కాయకర్పూరం సమర్పించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్యస్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

వైవీయూ: దైనందిక జీవితంలో మొక్కల పెంపకం .. ఓ భాగం కావాలని, వాటితోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూ జాతీయ సేవా పథకం యూనిట్-2 , 8 ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్‌పీ.వెంకటరమణ, డాక్టర్ సుమిత్ర ఆధ్వర్యంలో వాలంటీర్లు 300 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డా.సరిత, డా.అనుప్రసన్న పాల్గొన్నారు.

శ్రీరామ శోభాయాత్రకు ఏర్పాట్లు

కడప కల్చరల్: కడప నగరంలో వచ్చే ఏడాది శ్రీరామ శోభాయాత్ర నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ కోదండరామాలయంలో ధార్మిక సంఘాల ప్రతినిధులతో శనివారం జరిగిన సమావేశంలో కోదండ రామాలయం ధర్మకర్త దేశు వెంకటరెడ్డి మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ర్యాలీ సజావుగా జరిగిందని, మరింత ఐక్యతతో ఈసారి కార్యక్రమం నిర్వహించాలని కోరారు. సమైఖ్య అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు విజయ్‌భట్టర్ మాట్లాడుతూ శాస్త్రోక్తంగా యాత్ర నిర్వహించాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు తాము చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కరవర్మ, రాణా ప్రతాప్, దేవతి శంకరయ్య, ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు శ్లోక పఠన పోటీలు

కడప కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ గోపీబాబు తెలిపారు. శనివారం స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కోదండ రామాలయంలో పోటీల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి భగవద్గీత ఆరో అధ్యాయం ఆత్మ సంయోగం గురించి 47 శ్లోకాలను అప్పగించే పోటీ ఉంటుందన్నారు. 6, 7వ తరగతులకు జూనియర్, 8, 9వ తరగతులకు సీనియర్ విభాగంగా పోటీలు ఉంటాయన్నారు. సంపూర్ణ భగవద్గీతపై పట్టుగల 18 సంవత్సరాల లోపు విద్యార్థులు జూనియర్, 18 సంవత్సరాలు పైబడిన వారిని సీనియర్ విభాగంగా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు విభాగాలుగా నిర్వహించే ఈ పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏటూరి రామచంద్రారెడ్డి, రామ మహేష్, చింతకుంట శివారెడ్డి, డి.వెంకటరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, జి.సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలి

వైవీయూ: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి పట్టణంలో విద్యార్థుల దాడిలో మృతి చెందిన ఉపాధ్యాయుడు ఎజాస్ అహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలని ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.ప్రసాద్ డిమాండ్ చేశారు. కడప నగరంలోని ఏపీ ఎన్‌జీఓ కార్యాలయంలో శనివారం వారు మాట్లాడుతూ ఇలాంటి దుర్ఘటన దేశ చరిత్రలోనే లేదన్నారు. ఈ అనాగరిక చర్యలను నిలువరించేందుకు కఠిన చట్టాలు తీసుకురావాలని, ఈ ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.బాలపుల్లయ్య, కె.చిన్నయ్య, శైలేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసన్, నాగార్జున, పద్మనాభం, కాటమయ్య, జానకి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు విధానం రద్దు చేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ పీటీడీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు విజయ్, గంగాంజనేయులు కోరారు. కడప నగరానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ 7880 మంది ఔట్ సోర్సింగ్ కార్మికుల సర్వీసులను పరిగణలోకి తీసుకుని రెగ్యులర్ ఉద్యోగులుగా అవకాశం కల్పించి న్యాయం చేయాలని కోరారు. థర్డ్ పార్టీ వ్యవస్థను రద్దుచేసి క్యాజువల్ ఉద్యోగులుగా గుర్తించాలని వారు కోరారు.